క్లుప్తంగా

వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



నున్న(విజయవాడ రూరల్): నున్న గ్రామంలో శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం సంప్రదాయబద్ధంగా ప్రారంభమయ్యాయి. దేవదాయశాఖ కార్యనిర్వాహణాధికారి పి.మోహనరావు జ్యోగి వెలిగించి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆలయ అర్చకులు మామిళ్లపల్లి ఫణికుమార్ పూజా కార్యక్రమాలు నిర్వంచారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేటి నుంచి భూసర్వే

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో సోమవారం నుంచి జగనన్న భూ హక్కు, భూసర్వే నిర్వహించనున్నామని గ్రామ వీఆర్వో దేవప్రియుడు తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ రైతులు దస్తావేజులు, పాస్‌బుక్‌లు, ఇతర డ్యాక్యుమెంట్లతో సిద్ధంగా ఉండాలని సూచించారు. డాక్యుమెంట్ల ఫొటో స్టాట్ కాపీలు అందజేయాలని కోరారు.

రేపు శ్రీక్షేత్రంలో మహాలక్ష్మి జయంతి

గన్నవరం రూరల్: ఈ నెల 7న మహాలక్ష్మి జయంతి నిర్వహిస్తున్నట్లు చిక్కవరం శ్రీక్షేత్ర హనుమత్‌పురం ఆలయ కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా అభిషేకం, గోపూజ తామర పువ్వులతో, మారేడు దళాలతో పూజలు జరుగుతాయని భక్తులు పాల్గొనాలని కోరారు.

వార్డు సభ్యుల ఎన్నికకు రంగం సిద్ధం

ఉంగుటూరు: మండలంలో పలు గ్రామ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న వార్డు సభ్యుల ఎన్నిక నిమిత్తం డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ వివరాలను ఆయా గ్రామాల్లో సోమవారం ప్రదర్శించనున్నట్లు ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కారణాలతో ఖాళీగా ఉన్న గ్రామ పంచాయతీ వార్డుల వివరాలు వెల్లడించారు. తేలప్రోలు 4వ వార్డు, గారపాడు 8వ వార్డు, ఎన్‌పి పేట 4వ వార్డు, తుట్టగుంట 5వ వార్డుల డ్రాఫ్ట్ పోలీగ్ స్టేషన్‌ల జాబితాలను సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికలకు కసరత్తు ప్రారంభించారు.

నేడు 'స్పందన'

విజయవాడ రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయం లో నిర్వహిస్తామని తహసీల్దార్ పి.జాహ్నవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను అందజేయాలని కోరారు. అర్జీలపై తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. మండల స్థాయిలోని అధికారులు స్పందన కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

గ్యాస్ ధరలు తగ్గించాలని ఆందోళన



ఉంగుటూరు: పెరిగిన గ్యాస్ ధరలను తగ్గించాలని కోరుతూ ఉంగుటూరులో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంగం జిల్లా నాయకులు ఆజ్మీర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచి మరోసారి సామాన్య ప్రజల నడ్డి విరిచిందన్నారు. ఇప్పటికే నిత్యావసర ధరలు, పెట్రోలు, డీజిల్ ధరలు పెరిగి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. గ్యాస్ ధర మరోసారి పెంచడం వలన అన్ని వర్గాల ప్రజలపై పెనుభారం పడుతుందని పేర్కొన్నారు. పాలకు స్పందించి పెంచిన గ్యాస్ ధరలను తగ్గించి సామాన్య ప్రజలను ఆదుకోవాలని కోరారు. పలు సంఘాల నాయకులు టి.వీ రామ్మోహనరావు, పార్వతీశ్వరరావు, సలీమ్, సింహాచలం, సత్యానారాయణ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సీఐ బాధ్యతల స్వీకరణ



గన్నవరం: స్థానిక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐగా ఎన్‌వీఎస్.సూర్యనారయణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. నాలుగు నెలలుగా ఖాళీగా ఉన్న సీఐ పోస్టులో సూర్యనారాయణను నియమిస్తూ పోలీస్ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఆయన సీఐగా బాధ్యతలు స్వీకరించారు. తొలుత ట్రాఫిక్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

చెరువులకు మహర్దశ

- రెండు చెరువుల సుందరీకరణకు నిర్ణయం
- రూ 3.10 కోట్ల నిధులు మంజూరు
- త్వరలో అభివృద్ధి పనులు



కానూరు చిన్న చెరువు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో అధ్వానంగా ఉన్న రెండు చెరువులు సుందరీకరణకు రంగం సిద్ధం అవుతోంది. చెరువుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారు. చెరువుల అభివృద్ధితో గ్రామాలకు పూర్వ వైభవం తీసుకు వచ్చే దిశలో అధికార యంత్రాంగం కృషి చేస్తోంది.

తాడిగడప మున్సిపాలిటీలో ఉన్న కానూరు చిన్న చెరువు, పోరంకి ఊర చెరువు గతంలో ప్రజల అవసరాలకు ఉపయోగపడేవి. అయితే గ్రామాల్లో జనాభా పెరగటం, చెరువుల్లోకి మురుగునీరు వదలటంతో చెరువులు దారుణంగా మారాయి. దోమల ఉత్పత్తి కేంద్రాలుగా ఉండటంతో గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పైగా ఈ రెండు చెరువులు పూర్తిగా ఆక్రమణలకు గురయ్యాయి. కొందరు చెరువులు ఆక్రమించి ఇళ్లు కూడా నిర్మించారు. చెరువులు ఆక్రమణలకు గురవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో అధ్వాన్నస్థితికి చేరాయి

చెరువుల అభివృద్ధికి చర్యలు..

కానూరు చిన్న చెరువు, పోరంకి ఊర చెరువు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. తాడిగడప మున్సిపాలిటీకి అమృత్-2 పథకం రావటంతో రెండు చెరువులను రూ.3.10 కోట్లతో సుందరీకరణ చేయాలని నిర్ణయించారు.

నిర్వహించే పనులు ఇవీ..

చెరువుల అభివృద్ధిలో భాగంగా చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్, లైట్లు, చెరువులో నీరు శుద్ధిచేయటం, మురుగునీరు చెరువులోకి రాకుండా నివారించటం, అవసరమైతే చెరువులో బోటింగ్ ఏర్పాటు, చెరువు చుట్టూ ఉన్న ఆక్రమణలు తొలగించి పూర్వం చెరువు విస్తీరణ ఎంత ఉందో తిరిగి చెరువులు అలా రూపొందించటం ఇలా చెరువుల అభివృద్ధికి రంగం సిద్ధం చేస్తున్నారు. చెరువుల అభివృద్ధికి డీపీఆర్ రూపొందించి టెండర్లు పిలిచి చెరువు అభివృద్ధి పనులు చేపడతారు. చెరువులు అభివృద్ధి చెందితే దోమల బాధ తప్పుతుంది. గ్రామ వాతవరణం అహ్లాదకంగా మారుతుంది.

చెరువులను అభివృద్ధి చేస్తాం...



అమత్-2 నిధులతో కానూరు, పోరంకి చెరువులు అభివృద్ధి చేస్తాం. ఈ మేరకు నిధులు కూడా మంజూరయ్యాయి. ప్రణాళిక సిద్ధం చేసి త్వరలో పనులు చేపడతాం. దీర్ఘకాలంగా ఉన్న చెరువుల సమస్యలను పరిష్కరిస్తాం.

– ఎస్.ప్రకాశరావు, కమిషనర్, తాడిగడప మున్సిపాలిటీ

రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయిస్తా

- ప్రజలకు హామీ ఇచ్చిన ఎమ్మెల్యే పార్థసారథి
- సాయిపురంలో గడప గడపకు మన ప్రభుత్వం



సాయిపురంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: సాయిపురం గ్రామంలో రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. అర్హతే ప్రామాణికంగా పథకాల అమలుతో సీఎం జగన్ సంక్షేమ రాజ్య స్థాపనకు కృషి చేస్తున్నారని వివరించారు. మండలంలోని సాయిపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధితో రూపొందించిన సంక్షేమ బుక్‌లెట్లను అందజేశారు. స్థానిక సమస్యలపై అక్కడికక్కడే అధికారులతో సమీక్షించారు. సాయిపురానికి వచ్చే ప్రధాన రహదారి అభివృద్ధి, అంతర్గత రహదారుల నిర్మాణం, ధాన్యం కొనుగోళ్లు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమం ముగిసిన అనంతరం గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధిపనులు, సమస్యలపై సమీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పాలనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇంటి ముంగిటకే పాలన తీసుకొచ్చి విప్లవాత్మక మార్పులకు నాంది పలికారన్నారు. ప్రభుత్వం పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేయటంతో రైతులకు మద్దతు లభించిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తుమ్మూరు గంగారత్నం, నాయకులు గొరిపర్తి సుబ్రమణ్యం, తూమాటి ప్రకాశం, గొరిపర్తి వెంకటేశ్వరరావు, మాధవరావు, అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు బైరెడ్డి ఘన నివాళి



కామయ్యతోపులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

పెనమలూరు: కానూరు కామయ్యతోపులో అంబేడ్కర్ విగ్రహానికి శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా మెరుగుమాల కాళి ప్రమాణ స్వీకారానికి ఆదివారం గుడివాడకు ర్యాలీగా వెళుతూ కామయ్యతోపులో కొద్దిసేపు ఆగారు. పార్టీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. అనంతరం పార్టీ శ్రేణులతో మాట్లాడారు. యువజన విభాగం అధ్యక్షుడు మెరుగుమాల కాళి, స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు వేమూరి బాలకృష్ణ, గుమ్మడి విజయ్‌కుమార్, తుమ్మల వరదీష్, అంగిరేకుల సీతారామయ్య, చాంద్‌బాషా, పిన్నబోయిన రవి, ఖాదర్, మాదు రమేష్, బబ్లూ పలువురు పాల్గొన్నారు.

బైరెడ్డికి ఘన స్వాగతం

కంకిపాడు: శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి కంకిపాడులో ఘనస్వాగతం లభించింది. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మెరుగుమాల కాళీ ప్రమాణస్వీకార సభ గుడివాడలో ఏర్పాటు చేసిన సందర్భంగా ఆదివారం కానూరు నుంచి చేపట్టిన ర్యాలీకి కంకిపాడు ప్రధాన సెంటరులో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి కొద్దిసేపు ప్రధాన సెంటరులో పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో మాట్లాడారు. అనంతరం ర్యాలీగా ఉయ్యూరు వైపు సాగారు. స్వాగతం పలికిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, జగనన్న సచివాలయాల మండల ఇన్‌చార్జి రాచూరి చిరంజీవి, అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, సీహెచ్‌సీ చైర్మన్ మేదంద్రావు కుటుంబరావు, వైస్ ఎంపీపీ కలపాల ప్రకాష్, లాం సురేష్, పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.

ఇన్వెస్టర్స్ సమ్మిట్ జగన్ దక్షతకు నిదర్శనం

ప్రముఖ పారిశ్రామికవేత్త కనుమూరి శివాజీ రాజు



కేక్ కట్ చేస్తున్న పారిశ్రామిక వేత్త కనుమూరి శివాజీ రాజు

హనుమాన్‌జంక్షన్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతం కావటం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన దక్షతకు సంకేతమని ప్రముఖ పారిశ్రామిక వేత్త, సావిత్ర ఆక్వాకల్చర్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత కనుమూరి శివాజీ రాజు అన్నారు. హనుమాన్‌జంక్షన్‌లోని ఆయన నివాసంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి రూ.13.43 లక్షల కోట్ల పెట్టుబడులు రావటం, తద్వారా 6.90 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించటం శుభపరిణామం అని చెప్పారు. విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ఏకంగా 18 రంగాలకు చెందిన కంపెనీల నుంచి రాష్ట్రానికి పెట్టుబడులు రావటం హర్షణీయమని శివాజీ రాజు అన్నారు. గడిచిన మూడున్నర ఏళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సుస్థిర, సమర్థవంతమైన పాలనే కారణమని కనుమూరి శివాజీ రాజు చెప్పారు. సంక్షేమ పథకాలంటే పేదలకు ఉచితాలు పంచటమని ప్రతిపక్షాలు హేళన చేస్తున్నాయని, కానీ సంక్షేమం అంటే హ్యూమన్ డెవలప్‌మెంట్ అని విశ్వసించిన గొప్ప దార్శనికుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. రాష్ట్రంలో మళ్లీ చంద్రబాబును అధికారంలోకి తీసుకురావటానికి కొన్ని మీడియా సంస్థలు ఆరాటపడటం దురదృష్టకరమని దుయ్యబట్టారు.

అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. పెరికీడు సర్పంచ్ పల్లపోతు జాన్ ప్రకాష్, మాజీ సర్పంచ్ తవ్వా హేమేశ్వర నరసింహామూర్తి, ఉప సర్పంచ్ మజ్జి దీవెనకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు రేవిణిశెట్టి జితేంద్రకుమార్, చేబత్తిన రవికుమార్ పాల్గొన్నారు.

రేపు తిరునాళ్ల ప్రారంభం

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ కానూరు గ్రామంలో శ్రీలక్ష్మితిరుపతమ్మ తిరునాళ్ల మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. గ్రామంలో అమ్మవారి ఉత్సవాలు ఈ నెల 7, 8 తేదీల్లో వైభవంగా నిర్వహించనున్నారు. తొలిరోజు 7న ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరిస్తారు. అనంతరం లక్ష్మితారుపతమ్మకు, గోపయ్యస్వామివారికి కల్యాణం చేస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు భక్తులు అమ్మవారికి బోనాలు చెల్లిస్తారు. భక్తుల దర్శనం అనంతరం ఉచిత ప్రసాదం అందజేస్తారు.

ప్రభోత్సవం..

కాగా 7న సాయంత్రం ప్రభోత్సవం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యుత్ దీపాలతో అలంకరించి ప్రభలను ఊరేగిస్తారు. ఇక 8న ఉదయం అమ్మవారి కల్యాణ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఈ నెల 14వ తేదీన మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులను అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తామని కమిటీ తెలిపింది. లక్ష్మితిరుపతమ్మ ఉత్సవాలలో భక్తులు పాల్గొనాలని కోరారు.

నవధాన్యాల సాగు మేలు

గన్నవరం రూరల్: రైతులందరూ ప్రకృతి వ్యవసాయం చేయాలని సబ్ డివిజనల్ యాంకర్(ఎస్‌డీఏ) ఎం.సులోచన సూచించారు. ఆదివారం మండలంలోని చిన అవుటపల్లిలో ప్రకృతి వ్యవసాయ విధానంపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని చైతన్యవంతం చేసేందుకు గ్రామాల వారీగా ర్యాలీలు చేస్తున్నామన్నారు. ఈ సీజన్‌లో నవధాన్యాలను సాగుచేసుకుంటే భూములకు మేలు జరుగుతుందన్నారు. 32 రకాల నవధాన్యాల విత్తనాలను ఎకరానికి 11కిలోలు చల్లుకోవాలన్నారు. వీటిని విత్తన గుళికలుగా తయారు చేసి ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీలు అందిస్తారన్నారు. విత్తన తయారీ ప్రక్రియను రైతులకు ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. కో-ఆర్డినేటర్ జె.సాయినాథ్‌రెడ్డి, గణేశ్వరమ్మ, ఐసీఆర్‌సీలు ఎస్.ప్రమీల, తుమ్మల రాయప్ప, సీతమ్మ, వీవోఏ నాగరత్నం, డ్వాక్రా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్యాభినయం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా ఆదివారం ఇంద్రకీలాద్రిపై పలువురు విద్యార్థుల కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ ప్రాంగణంలోనిరాజగోపురం ఎదుట కళావేదికపై శ్రీఅరుణ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీకి చెందిన కళాకారులు చక్కటి అభినయంతోనృత్య ప్రతిభను ప్రదర్శించారు. కళాకారులకు అమ్మ వారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

గృహ నిర్మాణాలకు లేఅవుట్లు సిద్ధం

- ఇంటి స్థలాలకు మార్కింగ్ పూర్తి
- కానూరు వాసులకు జగనన్న వరం



లేఅవుట్‌లో స్థలాల మార్కింగ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ సతీష్

పెనమలూరు: కానూరులో పేద ప్రజలు జగనన్న కాలనీలో గృహాలు నిర్మించుకునేందుకు రెవెన్యూ అధికారులు లేఅవుట్లు సిద్ధం చేశారు. గత 30 సంవత్సరాలుగా ఇళ్ల స్థలాలు లేక, సొంతింటి కల నెరవేర్చుకోవటానికి ఎదురు చూస్తున్న పేదలకు కల నెరవేరనుంది.

మండలంలో 3605 మంది లబ్ధిదారులు..

పెనమలూరు మండలంలో మొత్తం 14 వేల మందికి గతంలోనే ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలు పంపిణీ చేశారు. అయితే కానూరులో 3134 మందితో పాటు యనమలకుదురు గ్రామానికి చెందిన 471 మందికి కలిపి మొత్తం 3605 మంది లబ్ధిదారులకు లేఅవుటు-3లో పట్టాలు ఇచ్చారు. అయితే లబ్ధిదారులు గృహాల నిర్మాణానికి లేఅవుట్లు అభివృద్ధి చేయటంలో కొంత జాప్యం జరిగింది. అయితే పేదల అవసరాలు దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు చర్యలు చేపట్టారు.

మార్కింగ్‌తో ఇళ్ల స్థలాలు రెడీ..

కానూరుకు చెందిన 3000 మంది లబ్ధిదారులు గృహ నిర్మాణాలకు రెవెన్యూ అధికారులు వారం రోజులుగా కసరత్తు చేశారు. 3వ నంబర్ లేఅవుటు దాదాపు 74.33 ఎకరాలు విస్తరించి ఉంది. లేఅవుటును చదును చేసి లబ్ధిదారులకు ఇచ్చిన పట్టాల ప్రకారం ఇళ్ల స్థలాల మార్కింగ్ చేశారు. మార్కింగ్ రాళ్లకు కనబడే విధంగా ప్లాటు నంబర్ వేశారు.

త్వరలో స్థలాలు స్వాధీనం..

లబ్ధిదారులకు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి త్వరలో ఇళ్ల స్థలాలు స్వాధీనం చేయనున్నారు. గృహాల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 1.80 లక్షలు, రుణ సౌకర్యం కూడా కల్పించనుంది.

గృహాలు నిర్మించుకోండి..

కానూరుకు చెందిన 3 వేల మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలకు మార్కింగ్ పూర్తి చేశాం. ఎమ్మెల్యే పార్థసారథి ఆధ్వర్యంలో పొజిషన్ వారంలో ఇస్తాం. లబ్ధిదారులు ప్రభుత్వ సాయంతో గృహాల నిర్మాణం వెంటనే చేపట్టాలి. ఇసుక కూపన్లు కూడా జారీ చేస్తాం.

–టీవీ.సతీష్‌తహసీల్దార్, పెనమలూరు

పెట్టుబడులకు ఏపీ కేంద్ర బిందువు

ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా, నేతలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): విశాఖలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ద్వారా జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు ఏపీ కేంద్ర బిందువుగా మారిందని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రముఖ దిగ్గజ కంపెనీలన్నీ సముఖత చూపాయంటే దానికి కారణం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతం కావడంతో సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయం ఎదుట ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని సంక్షేమ పథం, అభివృద్ధి పథంలో నడిపించే సత్తా ఉన్న గొప్పవ్యక్తి మనకు ముఖ్యమంత్రిగా రావడం అదృష్టమన్నారు. గత టీడీపీ హయంలో ఎంటయూలు తప్పించి, ఎక్కడా అభివృద్ధి కనిపించలేదని కేవలం ప్రచారానికి మాత్రమే చంద్రబాబు పని చేశాడని విమర్శించారు. జగనన్న సంక్షేమ పాలన చూసిన ప్రఖ్యాతిగాంచిన కంపెనీల అధినేతలు స్వయంగా ఈ సమ్మిట్‌లో పాల్గొని తమ పెట్టుబడులు వివరించడం చారిత్రాత్మకమన్నారు. రాష్ట్రానికి తరలివస్తున్న పారిశ్రామిక వేత్తలు, పరిశ్రమలను చూసి ఓర్వలేని చంద్రబాబు, ఎల్లో మీడియా దీనిపై కూడా విషప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. బాధ్యతగల మీడియా రంగంలో ఉండి కూడా కొన్ని పచ్చ మీడియాలు రాష్ట్ర ప్రతిష్టతను దిగజార్చేలా రాతలు రాయడం నీచమైన సంస్కృతి అని, వీరికి ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రాష్ట్రాన్ని పురోగతి వైపు నడిపిస్తున్న జగనన్నే మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని రాష్ట్ర ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ అలీమ్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హాఫీజుల్లా, నందెపు సురేష్, చింతా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధుల ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘ ప్రతినిధులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బీసీ సంక్షేమ సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు పలువురు సంఘ ప్రతినిధులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. చిట్టినగర్‌లోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో నిర్వహించిన ప్రమాణ స్వీకారోత్సవానికి బీసీ సంక్షేమ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులుగా ముస్తఫా, ఉపాధ్యక్షులుగా పుల్లారావు, ప్రధాన కార్యదర్శి మేక వెంకటేశ్వరరావు, నగర అధ్యక్షులుగా చిప్పాడ చందు బాధ్యతలు స్వీకరించారు. కనకారావు, చల్లపల్లి మోహన్‌రావు, ధనాలకోట శోభన్‌బాబు, డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలో నిర్మాణంలో ఉన్న జగనన్న ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్ డీఈ నాగమల్లేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆదివారం సమీక్ష జరిపారు. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలపై తీసుకోంవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఇళ్లు పూర్తయిన లేఅవుట్‌లలో మౌలిక సదుపాయాల కల్పన, పెండింగ్ బిల్లుల చెల్లింపులపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేందుకు కృషి చేయాలని సూచించారు.

ఠాగూర్ గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అయ్యంకి వెంకట రమణయ్య స్మారకార్థం ఆయన మనువడు సరస్వతి సామ్రాజ్యం అధ్యక్షులు అయ్యంకి మురళీకృష్ణ.. ఠాగూర్ గ్రంథాలయానికి క్రీడా పరికరాలు, పుస్తకాలు అందజేశారు. ఆదివారం ఠాగూర్ గ్రంథాలయంలో అయ్యంకి వెంకట రమణయ్య 44వ వర్థంతి కార్యక్రమం జరిగింది. అయ్యంకి విగ్రహానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ నివాళులర్పించారు. ఈ సందర్భంగా జమల పూర్ణమ్మ మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి అయ్యంకి చేసిన సేవలను కొనియాడారు. పరికరాలు అందజేసిన మురళీకృష్ణను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి రమాదేవి, సునీత, రమేష్, జగదీష్, మోహన్, మాధురి తదితరులు పాల్గొన్నారు.

మంచి నడవడికతో అభివృద్ధి

ఆటోనగర్(విజయవాడతూర్పు): ప్రతి ఒక్కరూ మంచి నడవడికతో అభివృద్ధి చెందాలని జమాఅతె ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ రఫీక్ ఆకాంక్షించారు. ఆదివారం రాత్రి జవహార్ ఆటోనగర్‌లోని ఒక హోటల్‌లో జమా అతె ఇస్లామి హింద్ విజయవాడ ఆధ్వర్యంలో మానవత- నైతికతపై ఆత్మీయ సమావేశం జరిగింది. ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ సమాజంలో ఎక్కడ చూసినా మోసం, దగా అనేవి పెరిగిపోయాయన్నారు. సమాజంలో నైతికత విలువలు పెంపొందించడానికి జమాఅతెఇస్లామి హింద్ రాష్ట్రస్థాయిలో సెమినార్లను నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సిటీ కార్యదర్శి ఎండీ ఇబ్రహీం, హబీబ్‌ఖాన్, అబ్దుల్‌కలాం, బాబు, బాలగంగాధర్‌తిలక్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

రేపు నెమలిలో పౌష్టికాహార స్టాల్ ఏర్పాటు

నెమలి(గంపలగూడెం): నెమలి శ్రీ వేణుగోపాల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం పౌష్టికాహార స్టాల్ నిర్వహించనున్నట్లు తిరువూరు సీడీపీఓ సత్యవతి తెలిపారు. తక్కువ ఖర్చుకు ఎక్కువ పోషకాలు ఉన్న ఆహార పదార్థాల తయారీపై ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా స్టాల్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. మహిళలు ఎవరైనా పోషకాహారాన్ని తయారు చేసి స్టాల్‌లో ప్రదర్శించవచ్చని తెలిపారు.

'సార్' సినిమాకు ప్రత్యేక రాయితీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ధనుష్ నటించిన 'సార్' సినిమా ప్రేక్షకాదరణ పొందిందని, చిత్ర సందేశాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులకు అందించాలనే ఉద్దేశంతో సినిమా ప్రదర్శనపై ప్రత్యేక రాయితీ కల్పిస్తున్నట్లు జేపీఆర్ ఫిల్మ్ అధినేత, సినిమా డిస్ట్రిబ్యూటర్ డాక్టర్ పవన్ కుమార్ తెలిపారు. ఆదివారం ఫిల్మ్ చాంబర్ హాల్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్యలకు పాల్పడటం విచారకరమన్నారు. సార్ సినిమాలో విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య బంధాన్ని హృదయానికి హత్తుకునేలా చిత్రీకరించారన్నారు. సినిమా చూసేందుకు విద్యార్థులు ముగ్గురు కన్నా ఎక్కువ మంది థియేటర్‌కు వస్తే ఒక టికెట్ పై మరో టికెట్ ఉచితంగా అందిస్తామన్నారు. 50 మంది విద్యార్థులు ఏదైనా ఒక విద్యా సంస్థ నుంచి వస్తే ఒక టికెట్‌పై ఇద్దరికి ఉచితంగా సినిమా చూసే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కోరితే వారికోసం ప్రత్యేకంగా ఒక షో ప్రదర్శిస్తామన్నారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో 'సార్' సినిమా ప్రదర్శిస్తున్న అన్ని థియేటర్లలో ఈ రాయితీ పొందవచ్చని తెలిపారు. వివరాలకు 97051 61908లో సంప్రదించాలన్నారు. / సమావేశంలో సాయిరాం స్క్రీన్స్ 'అధినేత వినీత్‌సాయి, సురేష్ మూవీస్ డిస్ట్రిబ్యూటర్ మేనేజర్ భగవాన్ పాల్గొన్నారు.